క్లుప్తంగా

టీషర్టులు అందజేత



టీ షర్టులు అందిస్తున్న దాతలు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాతలు టీ షర్టులు అందించారు. మంగళవారం గ్రామానికే చెందిన శిరీష, అభిలాశ్ త మ తండ్రి దొడ్డికింది నారాయణ జ్ఞాపకార్థం రూ.20వేలు విలువైన టీ షర్టులను 90 మందికి అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సరిత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

మామడ: మండలకేంద్రంలో మంగళవారం రాజ్‌గోండ్ సేవాసమితి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా సిడాం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా సిడాం బాదు, ఉపాధ్యక్షుడిగా మదన్‌రావు, సలహాదారూ సంతోష్, సభ్యులుగా మాణిక్‌రావు, చిత్రు ఎన్నికయ్యారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు పేర్కొన్నాడు.

మిత్రుడి కుటుంబానికి అండ

లక్ష్మణచాంద/నిర్మల్‌టౌన్: నిర్మల్‌లోని వెంకటాపూర్ కాలనీకి చెందిన శోభన్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. శోభన్ బాబుతో కలిసి లక్ష్మ ణచాంద మండలం వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదోతరగతి చదివిన మిత్రులు రూ.40వేలను జమ చేశా రు. మంగళవారం వెంకటాపూర్ వెళ్లి మిత్రుడి కుటుంబానికి నగదు అందించారు. రమణ, మధు, శ్రీకాంత్, సుభాష్, నర్సయ్య, సతీష్, గంగాధర్, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలకు టీవీ విరాళం



టీవీ అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భైంసారూరల్: మండలంలోని కుంసర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం టింటామాస్ మోగాసన్ సంస్థ, గ్రా మీణ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువైన టీవీని అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కదారి నరేశ్, తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్, హెచ్ఎం దత్తాత్రి, ఉపాధ్యాయులు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న రైతులు

ముధోల్: ఇటీవల భారీవర్షాలకు పంటలు నష్టపోయిన తమకు పరిహారం చెల్లించాలని కోరుతూ రైతులు మంగళవారం ముధోల్‌లో తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. సర్వే నిర్వహించి దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, వీడీసీ అధ్యక్షుడు విఠల్, నాయకులు, రైతులు రోళ్ల రమేశ్, బోయిడి అనిల్, పోతన్న, జీవన్, సాయి, ప్రసాద్, జీవన్ తదిరులున్నారు.

కొనసాగిన నిమజ్జనం

కుంటాల: వినాయక నిమజ్జనం సందర్భంగా మండలకేంద్రంలో మంగళవారం శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో బ్యాండ్ మేళాల నడుమ ప్రతిమలను తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలి

ఖానాపూర్: ప్రతీ విద్యార్థి పేరు ఎఫ్ఆర్ఎస్‌లో విధిగా నమోదు చేయాలని డీఐఈవో జాదవ్ పరుశురాం నాయక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళోజీ జయంతి వేడుకలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఆనందం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌రెడ్డి తదితరులున్నారు.

సాయం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో మంగళవారం పేద కుటుంబానికి చెందిన గోపికృష్ణ అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి ఐదో వా ర్డు మాజీ కౌన్సిలర్ పరిమి లతసురేశ్ దంపతులు రూ.5 వేలను సాయంగా అందజేశారు. రాపెల్లి ఎర్రన్న, నరేశ్, బొల్లిశెట్టి కన్నయ్య, మల్లికార్జున్, శంకర్ తదితరులున్నారు.

రాజీయే రాజమార్గం..

- ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్
- వేదికగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ కోర్టులు
- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలంటున్న ఎస్పీ



నిర్మల్‌టౌన్: తెలిసో తెలియకో చేసిన తప్పులకు కేసులపాలై ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నవారు 'రాజీ మార్గమే రాజమార్గం' అనే సూత్రం అనుసరించి, వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అద్భుత వేదిక. కోర్టులో ఉన్న పెండింగ్ కేసులతోపాటు, వ్యాజ్యానికి ముందు దశలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశాన్ని ఈ వేదిక కల్పిస్తుంది.

మూడు కోర్టుల్లో..

జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ కోర్టుల్లో ఈ నెల 13న శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు. కక్షిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని.. తమ కేసులను రాజీ ద్వారా ముగించవచ్చు.

రాజీ చేసుకునే కేసుల వివరాలు

లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు. వీటిలో కొన్ని..

- వాహన ప్రమాదాలకు సంబంధించిన వివాదాలు.
- చీటింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు.
- శారీరక గొడవలకు సంబంధించిన సమస్యలు.
- దాంపత్య సమస్యలు, విడాకుల కేసులు.
- స్వల్పస్థాయి దొంగతనాలకు సంబంధించిన విషయాలు.
- కరోనా లాక్‌డౌన్ లో ఫైల్ చేసిన కేసులు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు.
- ఇతర రాజీపడదగిన కేసులు.

కోర్టుకు హాజరయ్యే విధానం..

లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడానికి కక్షిదారులు కొన్ని సాధారణ దశలను అనుసరించాలి. ఫిర్యాదుదారు, నిందితుడు ఇద్దరూ సంబంధిత కోర్టులో హాజరు కావాలి. గుర్తింపు కోసం ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. కోర్టులో హాజరైన వెంటనే రాజీ ప్రక్రియ పూర్తి చేసి, కేసును ఒకే రోజులో ముగించవచ్చు.

లోక్ అదాలత్ ప్రయోజనాలు

- సంవత్సరాల తరబడి సాగే న్యాయపరమైన చిక్కుల నుంచి విముక్తి.
- ఫార్మల్ కోర్టు విచారణ అవసరం లేకుండా సులభంగా పరిష్కారం.
- లీగల్ ఫీజులు, కోర్టు ఖర్చులు తగ్గుతాయి.
- తక్కువ ఖర్చుతో, శాంతియుతంగా వివాదాలను ముగించే అవకాశం.

కేసుల పరిష్కారానికి మంచి అవకాశం



కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అలదాత్ మంచి అవకాశం. వివాదాలు ఒక్కసారి ప్రారంభమైతే.. జీవితాంతం కొనసాగుతూనే ఉంటాయి. వాటిని త్వరగా పరిష్కరించుకోవాలి. రాజీపడదగిన కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలి. కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– జానకీషర్మిల, ఎస్పీ

కళాశాలలకు బకాయిలు విడుదల చేయాలి

కుంటాల: ప్రభుత్వం వెంటనే కళాశాలలకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని కల్లూరులో విద్యార్థులు, అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ తీశారు. ఈసందర్భంగా టీపీడీఎంఏ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమాన్యం ఎగ్జిక్యూటివ్ సభ్యులు బోయ సాయిలు మాట్లాడుతూ నాలుగేళ్లుగా బకాయిలు విడుదల చేయకపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గట్టుపల్లి శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కుంటాల : నిరసన ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కుభీర్: ప్రభుత్వం వెంటనే ప్రైవేటు కళాశాలలకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కుభీర్‌లో వివేకానంద, తపస్వీ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు రోడ్డుపై బైఠాయించారు. అధ్యాపకులు సట్ల రవి, సంధ్యారాణి, పోశెట్టి, శ్రీనివాస్, దత్తాత్రి, కె.రవి తదితరులు ఉన్నారు.



కుభీర్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆటో బోల్తా.. వ్యక్తికి గాయాలు

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామ సమీపంలో మంగళవారం అదుపు తప్పి ఆటో బోల్తా పడినట ఘటనలో కల్లూరుకు చెందిన ఆటో డ్రైవర్ రవిగౌడ్‌కు గాయాలయ్యాయి. భైంసా నుంచి కుంటాలకు వస్తున్న భైంసా రూరల్ సీఐ నైలు గమనించి డ్రైవర్‌కు ప్రథమ చికిత్స చేసి మానవత్వం చాటారు. అనంతరం క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.



డ్రైవర్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న సీఐ నైలు

పాఠశాలల్లో వైద్యశిబిరాలు

మామడ: మండలంలోని రాశిమెట్ల ఆశ్రమ పాఠశాల, పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలలో మంగళవారం వైద్యసిబ్బంది వైద్యశిబిరాలు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి మౌనిక విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను పరీక్షించి పలు వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శ్వేత, ఏఎన్ఎం భారతి, హెల్త్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో..

భైంసాటౌన్: పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మున్సిపల్ పారిశుధ్య, మెప్మా సిబ్బందికి మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. మున్సిపల్ వందరోజుల ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసర్ ఫిర్దోస్ జబీన్ వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, మెప్మా టీఎంసీ, సీఓలు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశా రు. మహాగాం పీహెచ్‌సీ వైద్యురాలు తౌసీబ్ 50 మందికి బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేసి మందులు అందించారు. మాజీ సర్పంచ్ గణేశ్, వైద్యసిబ్బంది సలీం, అంజనాబాయి, పుష్ప, రుక్మిణీ ఉన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి కాళోజీ

నిర్మల్‌ఖిల్లా: 'తెలంగాణ స్వరాష్ట్ర కాంక్షను రగిలించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి కాళోజీ నారాయణరావు.. ఓ ఆలోచన శిఖరం' అని తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రతినిధులు కొనియాడారు. జిల్లా కేంద్రంలోని వేదిక కార్యాలయంలో మంగళవారం కాళోజీ జయంతి నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ సాహితీవేత్త, కవి డాక్టర్ దామెర రాములు మాట్లాడుతూ కాళోజీ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని అన్నారు. పుట్టుక నీది.. చావు నీది.. మధ్యలోనే జీవితమంతా దేశానిది అన్న ఆయన మాటలు ఎంతోమందిలో స్ఫూర్తి నింపాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, సాహితీవేత్తలు తుమ్మల దేవరావు, కృష్ణంరాజు, పోలీస్ భీమేష్, అంబటి నారాయణ, వేణుగోపాల కృష్ణ, కుమ్మరి నాగారం, పత్తి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జిల్లా తెరవే ప్రతినిధులు

రోడ్లకు మరమ్మతులెప్పుడో?



అందకూర్ అలుగు వద్ద ఏర్పడిన బుంగ

- సారంగపూర్‌కు నిలిచిన రాకపోకలు
- ఇప్పటికీ చర్యలు చేపట్టని అధికారులు
- ప్రజలకు పొంచి ఉన్న ముప్పు

కుంటాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అందకూర్ అలుగు వద్ద బుంగ ఏర్పడగా కుంటాల నుంచి అంబకంటి గ్రామ సమీపంలో రోడ్డు కోతకు గురైంది. ఇప్పటికీ తాత్కాలిక మరమ్మతులు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలు సాగించేవారికి ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.

నిలిచిన రాకపోకలు..



కుంటాల-అంబకంటి మధ్య దెబ్బతిన్న రోడ్డు

కుంటాల నుంచి అంబకంటి వెళ్లే మార్గంలో కాళేశ్వరం కెనాల్ వద్ద సుమారు 200 మీటర్ల వరకు రోడ్డు కోత గురైంది. రోజూ భైంసా డిపో నుంచి నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ మీదుగా సారంగపూర్ మండల కేంద్రానికి వెళ్లే బస్సు 19రోజులుగా సారంగపూర్‌కు నడవడం లేదు. దీంతో నిర్మల్ నుంచి తిరిగి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

మంత్రికి ఎమ్మెల్యే వినతి

ఖానాపూర్: నియోజకవర్గంలోని మైనార్టీ పాఠశాలలకు భవనాలు మంజూరు చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి వడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రితోపాటు మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అబ్దుల్లా కోత్వాల్‌ను కలిసి విన్నవించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.



మంత్రికి విన్నవిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

సర్వీసు నిబంధనలు రూపొందించాలి

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ నిబంధనలను ప్రభుత్వం వెంటనే రూపొందించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. గుణాత్మకమైన విద్య అందించేందుకు విద్యా, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. మండలానికి ఇద్దరు చొప్పున ఎంఈఓలు, డిప్యూటీ విద్యాశాఖ అధికారుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. విద్యాశాఖకు నిధులు పెంచి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.భూమన్న యాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్ షేక్, వెంకటేశ్వర రావు, లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, నాందేవ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణ్

పేరు, ఫోన్ నంబర్లు రాయించారు

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో అధికా రుల పేర్లు, ఫోన్ నంబర్లు లేవు. దీనిపై ఈ నెల 6న 'సాక్షి'లో పేరు, ఫోన్‌నంబర్లేవి శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీనివాస్.. వసతి గృహ సంక్షేమాధికారి ఇలి యాస్ ఉద్దీన్‌కు మెమో జారీ చేశారు. అనంతరం వసతిగృహంలో అధికారుల పేరు, ఫోన్‌నంబర్లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు.



అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లతో ఫ్లెక్సీ

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కుభీర్ ఉన్నత పాఠశాలలో సన్మాన గ్రహీతలతో ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15 మందిని మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్లు సన్మానించారు. రత్నాపూర్‌కాండ్లీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి పూలమాల, మెమెంటో, సన్మాన పత్రాలను అందించారు. అనంతరం ఇటీవల పదోన్నతిపై మండలానికి వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈఓ సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎం విజయస్వప్న, గజ్జరం, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కె. శంకర్, రవి , ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16 మందికి సన్మానం

కుభీర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే వారిలో 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవగా మంగళవారం వారిని కుభీర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. ఎంఈవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని పేర్కొన్నారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శంకర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు అరవింద్, కార్యదర్శి సిందే దత్తాత్రి, పల్సి, పార్డి(బి), బెల్గాం పాఠశాలల హెచ్ఎంలు డి.సురేశ్, నారాయణ్‌రెడ్డి, రాజగంగ, కేజీబీవీ ప్రిన్సిపాల్ వాణి తదితరులు ఉన్నారు.



నిర్మల్‌రూరల్: సన్మానం పొందిన ఉపాధ్యాయులు

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులైన ఎ.సత్తన్న, కె.మల్లేశ్, బి.లావణ్య, జి.సులోచనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధర్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి, పాతఎల్లాపూర్ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం, ఎంపీడీవో రత్నాకర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, సౌకర్యాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, పీహెచ్‌సీ సబ్‌సెంటర్, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు.



సత్తన్‌పల్లిలో భోజనం పరిశీలిస్తున్న అధికారులు

కాళోజీకి ఘన నివాళి



లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



దిలావర్‌పూర్ : గుండంపల్లి ఉన్నత పాఠశాలలో..



భైంసారూరల్ : చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో..



ముధోల్ బాలికల ఉన్నత పాఠశాలలో..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం కాళోజీ జయంతి పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు తెలుగు భాషపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల విద్యార్థులకు కాళోజీ జీవితచరిత్ర వివరించారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాళోజీ తన రచనల ద్వారా తెలంగాణ సమాజాన్ని జాగృతం చేశారని పేర్కొన్నారు.



మామడ: కొరిటికల్ ఉన్నత పాఠశాలలో..



నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో..



కుభీర్ ఉన్నత పాఠశాలలో తెలుగు మాస్టారు వేషధారణలో విద్యార్థి

– సాక్షి నెట్‌వర్క్

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఉన్న గిరిజన భవనంలోకి విద్యుత్ బోర్డులు ధ్వంసం చేసి ఫ్యాన్లు ఎత్తుకెళ్లిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆత్రం రాజేశ్వర్, ఆత్రం భీంరావు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని గిరిజన భవన్‌ను సందర్శించి మాట్లాడారు. భవనం ఆవరణ పిచ్చి మొక్కలతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవనం పర్యవేక్షించేలా సిబ్బందిని నియమించి పరిసరాల్లో పోలీసులు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.



పరిశీలిస్తున్న నాయకులు